క్లుప్తంగా

బీసీలను మరోసారి మోసగించేందుకు కుట్ర



ఖిల్లాఘనపురం: బీసీలను మరోసారి 42శాతం రిజర్వేషన్ అంటూ మోసగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ళకృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ సామ్యానాయక్ అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లలో హామీలు నెరవేర్చక పోవడం, సకాలంలో యూరియా కూడా అందించలేకపోయారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాగైన లబ్ధి పొందాలని ఎక్కువ జనాభా ఉన్న బీసీలను మరోసారి మోసగించేందుకు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో భూమయ్య, పెద్ద అంజనేయులుగౌడ్, గొడుగు సత్యం, చిన్న అంజనేయులుగౌడ్, ప్రతాప్, బుచ్చిబాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వంతెన అప్రోచ్ పనులకు శంకుస్థాపన

మదనాపురం: ఊకచెట్టువాగు వద్ద నిర్మించనున్న నూతన వంతెన అప్రోచ్ పనులకు నేడు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పనులు ప్రారంభిచనున్నట్లు కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్, మాజీసర్పంచ్ భక్షి హనుమాన్ రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇద్దరి అదృశ్యం..

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణంలో వ్యక్తి కనిపించడం లేదని ఆదివారం భార్య దేశియాదమ్మ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హరిప్రసాద్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలో దేశి మహేష్ ఆదివారం మధ్యాహ్నం ఇంటినుంచి బయటికి వెళ్లిన అతను మళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, చుట్టుప్రక్కల వారి ఇళ్లు వెతికినా అతని ఆచూకి లభించలేదు. ఆమె ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పీర్లగుట్టకు చెందిన మొగిలిరవి ఈనెల 9న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంభ సభ్యులు చుట్టుప్రక్కల వెతికినా ఆచూకి లభించలేదు. తల్లి మొగిలి అనంతమ్మ ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వైద్య విద్యార్థికి సన్మానం



మదనాపురం: నిర్మల్ జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన అజ్జకొల్లు గ్రామానికి చెందిన బాలకొండన్న అరుణ దంపతుల కుమారుడు కిషోర్‌కుమార్‌ను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారి నివాసంలో పూలమాలతో మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ పార్టీ నాయకులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కరగట్ల మల్లేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు శాంతమూర్తి, చింతకాయల శ్రీను, బోయిని శ్రీనివాసులు, శరణ్, కొండన్న, మన్యం, బాలు, అంజి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



చిన్నంబావి: మండలంలోని పెద్దమారు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సుంకులమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన సీఐ వెంకటేశ్వర్లు రూ.55 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎత్తం పకీరయ్య, స్వాములు, దేవరపోగు మధు, నాగరాజు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర చింతకాయలు



అమరచింత: సాదరణంగా చింతకాయ అంటే తెల్లని రంగులో ఉంటుందని విషయం తెలిసిందే.. కానీ చింతకాయల్లో సైతం రంగుల చింతకాయ ఉంటాయన్న విషయం పలువురికి నేటికీ తెలియదు. నాగల్‌కడ్మూర్‌లో దేవేంద్రచార్యుల మఠంలో ఉన్న చింతకాయ చెట్టుకు ఎర్రని చింతకాయలు కాస్తున్నాయి. ఇలాంటివి నల్లమల్ల అడవుల్లో అరుదుగా ఉంటాయని వృక్ష ప్రేమికులు తెలిపారు.

ప్రయాణం.. ప్రమాదం



మల్కిమియాన్‌పల్లి శివారు రైస్‌మిల్లు దగ్గర వంతెన

- భారీ వర్షాలకు కుంగిన వంతెనలు
- భయం భయంగా ప్రయాణాలు
- పట్టించుకోని అధికారులు

ఖిల్లాఘనపురం: మండలంలో ఈ ఏడాది కురిసన భారీవర్షాలకు పలు గ్రామాలకు వెళ్లే రోడ్డుకు ఏర్పాటు చేసిన వంతెనలు ప్రమాదంలో పడిపోయాయి. ఓ పక్క కూలిపోయి కొద్దిపాటి రోడ్డు మాత్రమే మిగిలిపోయింది. నిత్యం రోడ్లవెంట తిరిగే వాహనదారులు ఆ రోడ్ల వెంట వెళ్లాలంటేనే భయం భయంగా వెళ్తున్నారు. ఎప్పుడు కూలిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. పొరపాటున పెద్ద వాహనాలు వస్తే తప్పనిసరిగా కూలిపోయే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు కూలిన ప్రాంతాలను పరిశీలించి మరమ్మతులు చేయడంలో అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెద్ద వాహనాలు వస్తే ఇబ్బందే..

మండలకేంద్రం నుంచి మామిడిమాడ, పర్వతాపురం, అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం గ్రామాలకు వెళ్లే రోడ్డుకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు కొత్తగా నిర్మిస్తున్న వంతెనకు ఇటీవల కురిసిన వర్షాలకు రెండువైపులా మట్టికొట్టుకపోయి మధ్యలో మాత్రమే కొంత మిగిలింది. మధ్యలో ఉన్న కొద్దిపాటి మట్టిమీద మోటర్‌సైకిళ్లు, చిన్న ఆటోలు మాత్రమే వెళ్లడానికి వీలుగా ఉంది. ఇది కూడా ఎప్పుడు కూలిపోతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇదే రోడ్డుకు



అప్పారెడ్డిపల్లి పెద్ద వాగుపై బ్రిడ్జి దగ్గర ఇలా..



పర్వతాపురంలో నిర్మిస్తున్న వంతెన దుస్థితి

వైన్‌షాపుల ముందుగా మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాలకు వెళ్లే ప్రధానరోడ్డుకు కలుపుతూ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డుకు వర్షపు నీళ్ళు, గ్రామం నుంచి వచ్చే మురుగునీరు వెళ్లడానికి వీలుగా ఏర్పాటు చేసిన మట్టివంతెన ఓ సైడు కూలి లోపలివరకు కూలిపోయింది. ఈ రోడ్డుమీద కూడా చిన్న వాహనాలు మాత్రమే వెళ్లడానికి అవకాశం ఉంది. దీంతో ఈ రహదారి గూండా వెళ్లే గ్రామాలకు ట్రక్కులు, టిప్పర్లు తదితర పెద్దవాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. పర్వతాపురం నుంచి ఖిల్లాఘనపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అప్పారెడ్డిపల్లి గ్రామానికి పోయే రోడ్డుకు బ్రిడ్జి దగ్గర ఓ సైడ్ గ్రామానికి చెందిన బ్రాహ్మణకుంట చెరువు అలుగు పారినప్పుడు వచ్చే నీళ్ళతో కోతకు గురైంది. అధికారులు త్వరగా పట్టించుకోకపోతే రూ.కోట్లతో నిర్మించిన బ్రిడ్జి కాస్త కూలిపోయే ప్రమాదముందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మల్కిమియాన్‌పల్లి నుంచి అప్పారెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు రైస్‌మిల్లు దగ్గర బీటీ రోడ్డుకు ఏర్పాటు చేసిన వంతెన సగానికి కూలిపోయింది. అక్కడ ఉన్న రైతులు గుర్తుగా ఓ చిన్న చెట్టు వేరును అడ్డుగా పెట్టారు. ఏదైన పెద్ద వాహనం వచ్చిందంటే కూలిపోయే ప్రమాదం ఉంది. సంబంధితశాఖల అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆయా ప్రాంతాల్లో వర్షాలకు కూలిన వంతెనలకు మరమ్మతులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పెద్ద వాహనాలతో ఇబ్బందులు



మా ఊర్లో చాలామంది వ్యవసాయంతో పాటుగా కోళ్లఫారాలను పెట్టుకుని జీవిస్తున్నాం. దాన కోసం డీసీఎంలు వస్తుంటాయి. బ్రిడ్జి కూలడంతో దాటడానికి భయపడుతున్నారు. కూలీలను తీసుకువస్తున్న ఆటోలు వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు బ్రిడ్జి కూలిపోయే అవకాశం ఉంది. అధికారులు వచ్చి చూసి కొత్తగా బ్రిడ్జి కట్టాలి.

–కొత్తగొళ్ల చెన్నయ్య, అప్పారెడ్డిపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి..

మండలంలోని పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని మల్కిమియాన్‌పల్లి, అప్పారెడ్డిపల్లి గ్రామాల శివారులో వర్షాలకు కూలిన వంతెనల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేయిస్తాం.

–రమేష్‌నాయుడు, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ, ఖిల్లాఘనపురం

గుంపులుగా వస్తూ.. హడలెత్తిస్తూ



పాన్‌గల్ స్టాక్‌పాయింట్ గోదాం వద్ద కోతుల గుంపు

పాన్‌గల్: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రోజురోజుకూ కోతుల సమస్య ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. గుంపుగా తిరుగుతూ స్థానికులపై దాడికి పాల్పడుతున్నాయి. వానరాలతో ప్రజలు ఇంటినుంచి బయటకు రాలేక పోతున్నారు. రేకుల ఇళ్ల పై కప్పులను ధ్వంసం చేస్తున్నాయి. ఇళ్లల్లోకి వచ్చి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, చిందర వందర చేయడం నిత్యకృత్యంగా మారింది. మండల కేంద్రంలోనే వందలసంఖ్యకు పైగా వానరాలు సంచరిస్తున్నాయి. గతంలో కర్ర చూపిస్తే బెదిరిన కోతులు ప్రస్తుతం టపాకాయలు కాలినా శబ్దం చెవికెక్కకుండా.. అదురుబెదురు లేకుండా తిరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో కోతుల సమస్య పరిష్కరించా లని స్థానికులు కోరుతున్నారు.

దీపావళి ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలి

వనపర్తిటౌన్: దీపావళి సందర్భంగా ప్రతీఇంట్లో వెలుగు నిండాలని త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకట్రాములు ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం జిల్లాకేంద్రంలోని 10వ వార్డులో కొత్తకోట కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువు తన శిష్యుల తలలో జ్ఞాన జ్యోతి వెలిగించి యోగా మార్గంలో నడిపిస్తాడనే మాటకు గుర్తుగా దీపావళి రోజు ఇంట్లో దీపాలు వెలిగిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎం.పద్మ, శివమ్మ, బి.మాధవి, బి.శివకుమార్, మహేష్, సునీత, కె.అలివేల, స్నేహ, శశికుమార్, డి. లలితమ్మ, డి.లక్ష్మి, ధనుష్, శ్యామ్, అమ్ములు పాల్గొన్నారు.



భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డు పక్కనే సిరంజీలు

గోపాల్‌పేట: మండలకేంద్రం నుంచి వనపర్తి వెళ్లే రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు సిరంజిలు పారబోసి వెళ్లారు. బీటీ రోడ్డు పక్కనే పోయడంతో ఎప్పుడు ఎవరు తొక్కుతారోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గత మూడు రోజులుగా రోడ్డుపైనే సిరంజిలు కనిపిస్తున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. రోడ్డుపై ప్రతిరోజూ వందలాది వాహనాలు తిరగడంతో పాటు జనాలు కూడా నడుస్తూ పదులసంఖ్యలో రైతులు వెళ్తుంటారు. ఎవరికీ ఏ హాని జరగకముందే వీటిని దూరంగా పారబోసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గోపాల్‌పేట శివారులో పడి ఉన్న సిరంజీలు

సీజేఐపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి



నిరసనలో మాట్లాడుతున్న నాయకులు

అమరచింత: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్టు చేయాలంటూ డీహెచ్‌ఎస్ జిల్లాకార్యదర్శి రవీందర్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు భాస్కర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఆయా సంఘాల నాయకులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యాయమూర్తిపై దాడి ఓ పథకం ప్రకారం జరిగిందని దీనికి అస లు కారకులు ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ శక్తులు ఉన్నాయన్నారు. సీజేఐ దళితుడైనందువల్లే దాడికి ఒడిగట్టారన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు శ్యాం సుందర్, ఇబ్రాయిల్, సొలు, ఏసన్న పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూర్: అనుమతి లేని అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై నరేందర్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రేచింతల ఊకచెట్టువాగునుంచి ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందడంతో ఆదివారం రాత్రి 7 గంటలకు దాడులు నిర్వహించామని తెలిపారు. ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు వివరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ



పాన్‌గల్: మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామాంజనేయ ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా ఆదివారం ఆలయకమిటీ అధ్యక్షుడు రాముయాదవ్ ఆధ్వర్యంలో గడపగడపకు తిరుగుతూ విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ఆలయ నిర్మాణానికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా అన్ని వసతులతో నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణయాదవ్, మన్యం, వెంకటయ్య, అబ్దుల్లా, నిరంజన్, వేణుయాదవ్, రాములు, మహేష్ పాల్గొన్నారు.

'బాకీ కార్డులతో కాంగ్రెస్ గుండెల్లో గుబులు'



బాకీ కార్డులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి రూరల్: బాకీకార్డుల పంపిణీతో కాంగ్రెస్ పార్టీలో గుబులు పుట్టిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అన్నారు. ఆదివారం మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దగూడెం, కడుకుంట్ల గ్రామాల్లో నిర్వహించిన బాకీకార్డుల పంపిణీలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి గ్రామంలో బాకీకార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అమలు కానీ హామీలతో గ్యారెంటీ కార్డులను పంచి అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో అమలు చేస్తామని మోసం చేసిందని దుయ్యబట్టారు. బకాయిపడ్డారని స్థానిక ఎన్నికల్లో వచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఈ బాకీ కార్డు చూపించి నిలదీయాలని ప్రజలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నాయకులు ధర్మనాయక్, అశోక్, కొండన్న, లక్ష్మికాంత్‌రెడ్డి, సువర్ణ, శ్రీనివాసులు, శివన్న, హరితా, బాలకృష్ణ, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల ప్రారంభంపై హర్షం

వీపనగండ్ల: మండలంలోని బొల్లారం చౌరస్తా నుంచి ఎండబెట్ల క్రాస్ రోడ్డు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులు ప్రారంభం అవ్వడంతో రైతులు, పరిసర గ్రామాల ప్రజలు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. పెబ్బేరు, గద్వాల పట్టణాల నుంచి నాయనిపల్లి, మైసమ్మతల్లి ఆలయానికి చేరుకునేందుకు గోవర్ధనగిరి, వీపనగండ్ల, బొల్లారం చౌరస్తా, ఎండబెట్ల, అంకిరావుపల్లి స్టేజి నుంచి నాయనిపల్లి మైసమ్మకు వెళ్లేందుకు ఈ రోడ్డు ఎంతో అనువైనది. చిన్నంబావి, పెంట్లవెల్లి, కొల్లాపూర్ పట్టణం నుంచి వెళ్లే రహదారి కంటే ఈ రహదారి వెంట వెళితే దాదాపు 20కి.మీ. దూరం తగ్గుతుంది. కానీ 2కి.మీ రోడ్డు బీటీకి నోచుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎట్టకేలకు పనులు ప్రారంభం అవ్వడంతో పలువురు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.



ఎర్రమట్టి వేసిన గుత్తేదారు

ప్రమాదకరంగా కల్వర్టు

వీపనగండ్ల: మండలంలోని బొల్లారం, కొర్లకుంట గ్రా మాల మధ్య ప్రమాదకర కల్వర్టు ఉండడంతో రైతులు, వాహనదారులు ఇబ్బందుల కు గురవుతున్నారు. కొద్దిపాటి వర్షాలకే కల్వర్టు పైకి నీరు చేరుకోవడంతో ద్విచక్ర వాహనదారులు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వర్షాల సమయంలో కల్వర్టుపై ప్రయాణించేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు ఎత్తును పెంచాలని ఇరు గ్రామాల వారు కోరుతున్నారు.



బొల్లారం సమీపంలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

గుంతలు పూడ్చరూ..



వీపనగండ్ల-సంగినేనిపల్లి రహదారిలో గుంతలు

వీపనగండ్ల: మండలకేంద్రం నుంచి సంగినేనిపల్లి గ్రామానికి వెళ్లేందుకు ఉన్న ప్రధానరోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్రఇబ్బందులకు గుర వుతున్నారు. మండలకేంద్రం నుంచి వెళ్లే డబుల్‌బీటీ రోడ్డు నుంచి సంగినేనిపల్లి నుంచి కల్వరాల్ల గ్రా మానికి వెళ్లే డబుల్ బీటీ రోడ్డు మధ్యలో ఉన్న సింగిల్ బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా ఏర్పడి ద్విచక్ర వాహనదారులు కూడా వెళ్లేందుకు అనువుగా లేకపోవడంతో పలువురు ఇబ్బందులకు గుర వుతున్నారు. ఉన్నాధికారులు స్పందించి కనీసం గుంతలను మొర్రం మట్టి ద్వారా లేవల్ చేయించాలని రైతులు కోరుతున్నారు.

ఎట్టకేలకు సీసీ పనులు ప్రారంభం



మస్తీపురం రహదారిపై ఏర్పాటు చేసినా సూచిక బోర్డు

- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని మస్తీపురం రహదారి
- 600 మీటర్ల పనులు ప్రారంభం
- వాహనాల రాకపోకల నియంత్రణకు చర్యలు

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వెళ్లే రహదారిలో మస్తీపురం గ్రామానికి సంబంధించిన రహదారి నేటికీ సీసీ కాకపోవడంతో ప్రయాణికులతో పాటు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 600మీటర్ల సీసీ రహదారి కోసం రూ.కోటితో మంజూరు చేసిన సదరు కాంట్రాక్టర్ పనులను చేపట్టడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గ్రామం మీదుగా వెళ్తున్న ప్రధాన రహదారి అతుకుల గతుకుల రహదారిగా మారి ప్రయాణికులకు నరకంగా మారింది. గత రెండురోజుల కిందట సీసీపనులు చేపట్టేందుకు పీఆర్ అధికారులు, కాంట్రాక్టర్ ముందుకు రావడంతో గ్రామప్రజల్లో అసలు మరోమారు ఆశలు నింపింది. హమ్మయ్య ఇప్పటికైనా రహదారి పూర్తవుతుందా అనే సందేహాలను సైతం వ్యక్తం చేస్తున్నారు. ఏదీ ఏమైనా ఈ నెల చివరి నాటికి సీసీ పనులు పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ అధికారులు వెల్లడిస్తున్నారు.

వాహనాల దారి మళ్లింపు..

మస్తీపురం ఎక్స్‌రోడ్ నుంచి మస్తీపురం గ్రామం మీదుగా వెళ్తున్న వాహనాలతో పాటు గద్వాల, మక్తల్ పట్టణాల నుంచి వస్తున్న వాహనాల దారిని మళ్లించడానికి పీఆర్ అధికారులు దారి మళ్లింపు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారికి అడ్డంగా మొరం మట్టిని వేసి సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.

ఆర్టీసీబస్సులు అడ్డుకున్న మూలమళ్ల గ్రామస్తులు

మస్తీపురం గ్రామంలో సీసీ రహదారి పనుల కోసం భారీ వాహనాల రాకపోకలను నియంత్రించడం జరిగింది. దీంతో గద్వాల ఆర్టీసీ డిపోకు చెందిన షెటిల్ సర్వీసులు జూరాల ప్రాజెక్టు మీదుగా నందిమళ్ల, ములమళ్ళ గ్రామాల మీదుగా ఆత్మకూర్, అమరచింత గ్రామాలకు వెళ్తుండటంతో ములమళ్ళ గ్రామ ప్రజలు శుక్రవారం తమ గ్రామం మీదుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సులను అడ్డుకున్నారు. తాత్కాలికంగా బస్సులను నడపరాదని తమ గ్రామం మీదుగా శాశ్వతంగా బస్సులను నడపాలని డిమాండ్ చేస్తున్నారు.

నెలాఖరుకు పనులు పూర్తి..

మస్తీపురం గ్రామం మీదుగా నిర్మిస్తున్న సీసీ పనులు నెల చివరి నాటికి పూర్తి చెయ్యనున్నట్లు ఏఈ నరేష్ తెలిపారు. వీటికి సంబంధించిన మార్కింగ్‌ను వేశామని, వేగవంతంగా పనులు పూర్తి చేయనున్నామని వెల్లడించారు.

– నరేష్, ఏఈ పంచాయతీరాజ్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వనపర్తి రూరల్: శ్రీరంగాపురంలో బాలుర ఉన్నత పాఠశాలలో 1970–71, 1974–75 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పలువురు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో అనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నా రు.



శ్రీరంగాపురం బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

మద్యం దుకాణంలో చోరీ

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని వైన్స్ షాపులో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగిందని ఎస్ఐ యుగేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. పెబ్బేరులోని భవానీ వైన్స్‌షాపులో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపు వెనుకాల ఉన్న రేకును కట్‌చేసి లోపలికి దూరి కాటన్ క్వాటర్స్, 6 ఫుల్ బాటిళ్ల మద్యాన్ని ఎత్తుకెళ్లారని యజమాని రఘువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



పరిశీలిస్తున్న పోలీసులు